

ఏడు కొత్త ఇసుక రీచ్‌లకు ఆమోదం

ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సూర్యతేజ

భీమవరం: జిల్లాలో ఏడు కొత్త ఇసుక రీచ్‌లకు ఆమోదం తెలిపినట్లు ఇన్‌ఛార్జి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి సూర్యతేజ మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల ఆమోదానికి సంబంధిత శాఖల అనుమతులను జిల్లాస్థాయి కమిటీలో పరిశీలించిన అనంతరం ఏడు కొత్త రీచ్‌లకు అనుమతులను మంజూరు చేశామన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతం, నడిపూడిల్లో నాలుగు ఓపెన్ రీచ్‌లను, యలమంచిలి మండలం అబ్బిరాజుపాలెం, యలమంచిలి, నరసాపురం మండలం మాధవాయపాలెంలో మూడు డీసిల్టేషన్ పాయింట్లలో ఇసుక సేకరణకు ఆమోదం తెలిపామని చెప్పారు. సమావేశంలో సెబ్ ఎఎస్‌పి ఎటిబి.రవికుమార్, గనుల శాఖ డిడి బి.రవికుమార్, జిల్లా నీటి వనరుల అధికారి నాగార్జున, డిపిఒ ఎస్.నాగలత, జిల్లా రవాణా అధికారి మహేశ్వరరావు పాల్గొన్నారు.

పొత్తుల గుబులు..!



- టిడిపి, జనసేన పొత్తుపై ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ
- ఆశావహులైన టిడిపి, జనసేన నేతల్లో గుబులు
- పొత్తులో జనసేనకు కేటాయించే స్థానాలపై ఎవరి లెక్కలు వారివే
- ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుతో టిడిపి శ్రేణుల్లో పెరిగిన జోష్
- ఎంపీ స్థానాల కేటాయింపుపైనా లెక్కలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


ఎన్నికలకు ఏడాది మాత్రమే గడువు ఉండటంతో రాజకీయపార్టీల పొత్తులపై క్షేత్రస్థాయిలో తీవ్ర చర్చలు సాగుతున్నాయి. ఏ నలుగురు కలిసినా టిడిపి, జనసేన పొత్తుపైనే మాట్లాడుతున్న పరిస్థితి నెలకొంది. ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపుతో టిడిపి శ్రేణుల్లో జోష్ పెరిగింది. దీంతో వచ్చే ఎన్నికల్లో గెలుపోటములు, పొత్తులపైనే గ్రామ, పట్టణాల్లో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలతోపాటు సామాన్య ప్రజానీకంలోనూ చర్చలు సాగుతున్నాయి. టిడిపి, జనసేన పొత్తు ఖాయమనే భావన ఆ పార్టీల శ్రేణుల్లో గట్టిగా కన్పిస్తోంది. అదే సమయంలో టిడిపి, జనసేన పొత్తు ఖాయమైతే జిల్లాలో ఏ స్థానాలను జనసేనకు కేటాయిస్తారనే దానిపై ఎవరి లెక్కలు వారు వేస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరిశీలిస్తే 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. జిల్లాలో కాపు సామాజిక తరగతి ఎక్కువగా ఉండటంతో జనసేనకు ఓటింగ్ శాతం కూడా ఉంది. 2019 ఎన్నికల్లో భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం వంటి స్థానాల్లో జనసేన ప్రధాన పార్టీలకు దీటుగా నిలబడింది. దీంతో తక్కువగా లెక్కించినా జిల్లాలో ఏడు స్థానాల వరకూ జనసేనకు కేటాయించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అదే సమయంలో స్థానాల కేటాయింపునకు సంబంధించిన పేర్లు సైతం బాహాటంగానే విన్పిస్తున్నాయి. మరోపక్క టిడిపి, జనసేన పొత్తు కుదిరితే టిక్కెట్ ఆశిస్తున్న టిడిపి జనసేన నాయకుల్లో తమ పరిస్థితి ఏమిటనే గుబులు సైతం నెలకొంది. పొత్తులో భాగంగా టిక్కెట్ రాకపోతే ఏమిటనే ప్రశ్న ఆశావహులను తొలిచేస్తోంది.

టిక్కెట్లపై ఎవరి టెన్షన్ వారిదే..

టిడిపి, జనసేన పొత్తు ఖాయమైతే ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఏలూరు స్థానాలు జనసేనకు కేటాయించే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జిలుగా ఉంగుటూరుకు మత్తపల్లి ధర్మరాజు, తాడేపల్లిగూడెనికి బొలిశెట్టి శ్రీనివాస్, ఏలూరుకు రెడ్డి అప్పలనాయుడు, నరసాపురానికి బొమ్మిడి నాయకర్ వంటి వారున్నారు. పాలకొల్లు, భీమవరంల్లో సమర్థులైన నాయకులను బరిలో దింపాలనే యోచనలో సైతం జనసేన ఉన్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఆ నియోజకవర్గాల్లో టిడిపికి బలమైన నాయకులు, మాజీ ఎంఎల్‌ఎలు ఉన్నారు. ఉంగుటూరుకు ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, పాలకొల్లులో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఏలూరులో బడేటి కుటుంబం, భీమవరంలో తోట సీతారామలక్ష్మి కుటుంబం, నరసాపురంలో బండారు మాధవనాయుడు, తాడేపల్లిగూడెంలో మాజీ జెడ్‌పి ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు వంటి నాయకులు ఉన్నారు. పొత్తు కుదిరి ఈ స్థానాలు జనసేనకు కేటాయిస్తే వీరి భవిష్యత్తు ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విధంగా జరిగితే ఎన్నికల్లో వీరంతా జనసేనకు సహకరిస్తారా లేక అసంతృప్తితో ధిక్కార స్వరం వినిపిస్తారా అనే చర్చ జిల్లాలో నడుస్తోంది. ఏదేమైనా పొత్తు ఖాయమైతే జనసేనకు జిల్లాలో ఏడు సీట్లు ఖాయమనే అభిప్రాయంతో ఆ పార్టీ శ్రేణులు బలంగా చెబుతున్నారు. నరసాపురం ఎంపీ స్థానం జనసేనకు కేటాయిస్తారనే చర్చ సైతం నడుస్తోంది. పొత్తుల్లో బిజెపి ఉంటే ఆ పార్టీకి ఏ స్థానాలు కేటాయించే అవకాశం ఉందనే మరో చర్చ సైతం సాగుతోంది. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న కొద్ది పొత్తులపై క్షేత్రస్థాయిలో ఉత్కంఠ నెలకొంది.

రాజకీయ అజాతశత్రువు..
యర్రా ఇక లేరు

- అనారోగ్యంతో భీమవరం ఆసుపత్రిలో మృతి
- భౌతికకాయం స్వగ్రామం ఉప్పలూరు తరలింపు
- ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో విషాదఛాయలు
- కుటుంబానికి మంత్రి కారుమూరి ఫోన్లో పరామర్శ
- నారాయణస్వామి మృతి పట్ల సిపిఎం సంతాపం



ప్రజాశక్తి - భీమవరం

రాజకీయ దురంధరుడు, అజాతశత్రువుగా పేరొందిన మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నేత యర్రా నారాయణస్వామి (92) బుధవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. అనారోగ్యంతో స్థానిక ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. అంత్యక్రియల నిమిత్తం నారాయణస్వామి భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఉండి మండలం ఉప్పలూరు తరలించారు. ఈ నేపథ్యంలో ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉన్నత జమిందారీ కుటుంబంలో జన్మించి సామాన్య ప్రజల అభ్యున్నతి కోసం పదవుల్లో ఉన్నా లేకపోయినా నిరంతరం శ్రమించిన నిరాడంబరునిగా యర్రా నారాయణస్వామి పేరొందారు. 1931 ఏప్రిల్ 30న ఆయన ఉండి మండలం ఉప్పలూరులో యర్రా సూర్యారావు, శేషాయమ్మ దంపతులకు తృతీయ సంతానంగా జన్మించారు. సూర్యారావు సోదరుడు యర్రా చంద్రరావు, ఆండాళ్లమ్మ దంపతులకు నారాయణస్వామి దత్తపుత్రునిగా వెళ్లారు. ప్రాథమిక విద్య ఉప్పలూరులో, మాధ్యమిక విద్య 'నవభారత గురుకులం' రాజమండ్రిలో పూర్తి చేశారు. 'రామకృష్ణ మఠం' తణుకులో ఉంటూ జిల్లా బోర్డు ఉన్నత పాఠశాలలో చదివారు. 1945 తర్వాత విశాఖపట్నంలో రామకృష్ణ మఠంలో ఉంటూ ఎవిఎన్ పాఠశాలలో ఎస్ఎస్ఎల్‌సి ఉత్తీర్ణులయ్యారు. 1947-49 మధ్య భీమవరం డబ్ల్యుజిబి కళాశాలలో ఇంటర్, కాకినాడ పిఆర్ కళాశాలలో డిగ్రీ పూర్తిచేశారు. తరువాత లక్నో రెసిడెన్షియల్ యూనివర్సిటీలో ఎంఎ, ఎల్ఎల్‌బి చదివారు. 1952 మే 15న తూర్పుగోదావరి జిల్లా అంతర్వేదికి చెందిన బెల్లంకొండ పెదరాజన్న కుమార్తె సీతామహాలక్ష్మిని వివాహం చేసుకున్నారు. 1956లో హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి రామచంద్రరావు వద్ద అప్రంటీస్‌గా కొద్దికాలం పని చేసి మానేశారు. 1958 వరకూ చిత్ర నిర్మాణ రంగంలో ప్రవేశించి సహనిర్మాతగా 'ఆడపెత్తనం' చిత్రాన్ని నిర్మించారు. మద్రాసు నుండి తిరిగొచ్చిన నారాయణస్వామి ఉప్పలూరు ప్రజల అభ్యర్థనపై 1960లో గ్రామ సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికై దశాబ్దకాలం పాటు 1970 వరకూ కొనసాగారు.

నారాయణస్వామి గ్రామ సర్పంచిగా పని చేసిన కాలంలో తండ్రి చంద్రరావు పేరున 'చంద్ర కళాసమితి' అనే సాంస్కృతిక భవనం, గ్రంథాలయ భవనం, పశువైద్యశాల, 1956లో చంద్రరావు, ఆండాళ్లమ్మ మిడిల్ హైస్కూల్, వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం సొంతం నిధులతో నిర్మించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. జిల్లాలోనే ప్రప్రథమంగా ఉప్పలూరులో రక్షిత మంచినీటి పథకాన్ని అమలు చేసిన ఘనత ఆయన సొంతం. 1963 నుండి 1969 వరకూ 'ది కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్, ఉండి' శాఖకు ఛైర్మన్‌గా పి చేశారు. 'ది కృష్ణా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు డైరెక్టరుగానూ వ్యవహరించారు. 1960 నుండి 1976 వరకూ భీమవరంలో తన తండ్రిచే స్థాపించబడిన డబ్ల్యుజిబి కళాశాలకు వైస్ ప్రెసిడెంటుగా సేవలందించారు. 1972లో కాంగ్రెస్ తరఫున స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సిగా నారాయణస్వామి ఎన్నికయ్యారు. యర్రాను ప్రత్యేకంగా గుర్తించిన ముఖ్యమంత్రి జలగం వెంగళరావు 1976 ఆగస్టులో మంత్రి పదవి కట్టబెట్టారు.

టిడిపి ఆవిర్భావం అనంతరం ఆ పార్టీలో చేరిన నారాయణస్వామి తాడేపల్లిగూడెంలో నుంచి ఎంఎల్‌ఎగా బరిలోకి దిగి గెలుపొందారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా అత్యధిక మెజార్టీతో గెలుపొంది రికార్డు సృష్టించారు. 1987 నుంచి 1992 వరకూ ఆయన జెడ్‌పి ఛైర్మన్‌గా పని చేశారు. 1992 నుండి 2000 వరకూ టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యునిగాను పని చేశారు. 1994 జనవరిలో రాజ్యసభ సభ్యునిగా ఎన్నికయ్యారు. 1999లో తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గం నుండి తెలుగుదేశం అభ్యర్థిగా అఖండ విజయం సంపాదించారు.

ఉండి: మాజీమంత్రి, టిడిపి సీనియర్ నాయకులు యర్రా నారాయణస్వామి (92) మృతితో ఉప్పలూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. నారాయణస్వామి ఉప్పలూరు గ్రామ పంచాయతీ సర్పంచిగా రెండుసార్లు విజయం సాధించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. ఉండి విశాల సహకార పరపతి సంఘం ఛైర్మన్‌గా రెండుసార్లు బాధ్యతలు చేపట్టి పూర్తిస్థాయిలో రుణాలందించి రైతుల ఉన్నతికి పాటుపడ్డారు. 1978లో ఉండి నియోజకవర్గం నుంచి రెడ్డి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. యర్రా నారాయణస్వామికి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు యర్రా నవీన్ ప్రస్తుతం వైసిపిలో ఉన్నారు. రెండో కుమారుడు యర్రా సూర్యచంద్రరావు రాజకీయాలకు దూరంగా ఉన్నారు. యర్రా నారాయణస్వామి మృతితో ఆయన స్వగ్రామం ఉప్పలూరులో విషాదఛాయలు అలుముకున్నాయి. అంత్యక్రియల నిమిత్తం నారాయణస్వామి భౌతికకాయాన్ని ఉప్పలూరు తరలించారు.

తాడేపల్లిగూడెం: యర్రా నారాయణస్వామి మృతితో తాడేపల్లిగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈయన తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాల గౌరవాధ్యక్షులుగాను, భీమవరం డిఎన్ఆర్ కళాశాల పాలకవర్గ సభ్యులగానూ ఉన్నారు. నారాయణ స్వామి మృతి పట్ల టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

పాలకొల్లు: మాజీ మంత్రి యర్రా నారాయణ స్వామి మతి పట్ల ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్ఎ అంగర రామ్మోహన్ సంతాపం వ్యక్తం చేశారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఆయన ఉమ్మడి జిల్లాకు చేసిన సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు.

నారాయణస్వామి మృతి పట్ల సిపిఎం సంతాపం

భీమవరం: మాజీ మంత్రి యర్రా నారాయణస్వామి మృతిపట్ల సిపిఎం జిల్లా కమిటీ తీవ్ర సంతాపం తెలిపింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం బుధవారం ప్రకటన విడుదల చేశారు. నారాయణస్వామి జిల్లా రాజకీయాల్లో ముఖ్య పాత్ర పోషించారని పేర్కొన్నారు. జెడ్‌పి ఛైర్మన్‌గా, ఎంఎల్‌ఎగా, ఎంపీగా, మంత్రిగా పని చేసి ప్రజల గుర్తింపు, మన్ననలు పొందారని తెలిపారు. పోలవరం సాధన సమితి కన్వీనర్‌గా నిరంతరం కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన మృతి జిల్లాకు తీరని లోటు అని నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద బాధితులతో కలిసి ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గరగపర్రు రోడ్డులో ఇళ్ల తొలగింపుల్లో నష్టపోయిన పేదలకు ప్రభుత్వం వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. ఇళ్లు తొలగించిన ప్రాంతాన్ని సిపిఎం బృందం బుధవారం పరిశీలించింది. అనంతరం మున్సిపల్, ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద పేదలతో కలిసి ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ సుమారు 70, 80 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న పేదల ఇళ్లను అధికారులు, పోలీసులు నిర్దాక్షిణ్యంగా తొలగించారని మండిపడ్డారు. ఇళ్లను తొలగించకుండా హైకోర్టు నుండి స్టే తెచుకున్నప్పటికీ రెవెన్యూ, పోలీసు యంత్రాంగం ఏమాత్రం లెక్క చేయకుండా ఇళ్లను తొలగించారని విమర్శించారు. ఈ ప్రాంతంలో 50 ఇళ్లలో 150 కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. 1996లో నాటి నర్సాపురం సబ్ కలెక్టర్ కృష్ణబాబు వీరందరికీ పట్టాలు ఇచ్చారని గుర్తు చేశారు. వీరిలో అత్యధికులు దళితులు, ఇతర పేదలు ఉన్నారని తెలిపారు. ఇళ్లు తొలగించడంపై అధికారులకు ఉన్న ఉత్సాహం, వారికి ప్రత్యామ్నాయం చూపడంలో లేదని విమర్శించారు. ఇళ్లు కోల్పోయినవారికి టిడ్కో ఇళ్లను కేటాయించామని అధికారులు చెబుతున్నారన్నారు. టిడ్కో ఇళ్లు వాస్తవ లబ్ధిదారులు రాకపోవడం వల్ల వారి ఇళ్లను వీరికి కేటాయిస్తున్నామని అధికారులు చెబుతున్నారన్నారు. వాస్తవ లబ్ధిదారులు రాకపోవడానికి కూడా అక్కడ అనేక సమస్యలు ఉన్నాయన్నారు. రోడ్లు, తాగునీరు, డ్రెయిన్ వంటి అనేక మౌలిక సదుపాయాలు లేవన్నారు. దీనివల్ల వారు రాలేకపోయారన్నారు. అటువంటి ఇళ్లను వీరికి కేటాయించడంతో వాస్తవ లబ్ధిదారులు వస్తే వీరి మధ్య ఘర్షణ వచ్చే పరిస్థితిని ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇళ్ల తొలగింపు ప్రక్రియ కొన్నేళ్లుగా సాగుతున్నప్పటికీ, ప్రభుత్వం ఏమాత్రం ముందు చూపు లేకుండా వీరిని రోడ్డున పడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలో రైల్వే అండర్ పాస్ రావడం వల్ల కొంత ప్రాంతం నిరుపయోగంగా ఉందన్నారు. ఆ ప్రాంతంలో ఉన్న ఇళ్లను తొలగించాల్సిన అవసరమే లేదన్నారు. అయినప్పటికీ అధికారులు అత్యుత్సాహానికి పోయి ఇళ్లను తొలగించారని విమర్శించారు. అవసరం లేని ఇళ్లను కూడా ఎందుకు తొలగించారని ఆయన ప్రశ్నించారు. అధికారులు ఎవరి ప్రయోజనాల కోసం ఇళ్లను తొలగించారని ఆయన మండిపడ్డారు. ఇళ్లను కోల్పోయిన వారికి ఇళ్లను కేటాయిస్తున్నామని చెబుతున్న అధికారులు పట్టాలు ఉన్న వారికి కూడా ఇళ్లను కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. పట్టాలు ఉన్నవారికి కూడా ఇళ్లను కేటాయించకపోతే అసలు అధికారులు ఏ ప్రాతిపదికన ఇళ్లను కేటాయిస్తున్నారని, ఇళ్లను కోల్పోయిన లబ్దిదారులను ఏ విధంగా గుర్తించారని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాను కూడా పరిగణనలోకి తీసుకోకుండా చేపట్టిన సర్వే మొత్తం అస్తవ్యస్తంగా ఉందని ఆయన విమర్శించారు. తొలగించిన ఇళ్లలో ఒక్కో దానిలో మూడు, నాలుగు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఇప్పుడు టిడ్కో ఇళ్లను ఇచ్చి వాటిలో ఉండండి అని చెప్పడం అంటే అంతకన్నా దౌర్భాగ్యం ఉండదన్నారు. నష్టపోయిన కుటుంబాలు ఎన్ని ఉంటే అందరికీ ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, లేదా టిడ్కో ఇళ్లను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ఆర్‌డిఒ డి.రాజును కలిసి పేదల కష్టాలను వివరించారు. మున్సిపల్, ఇతర అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఆర్‌డిఒ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు ఎం.వైకుంఠరావు, డి.త్రిమూర్తులు, పట్టి శంకరం, రావడ మావుళ్లమ్మ, శేషం సింహాద్రి, ప్రసాద్, రమ్య, సుభాషిణి, లక్ష్మి, గుర్రమ్మ పాల్గొన్నారు.

టెండర్ విధానం రద్దు కోరుతూ ధర్నా



పెంటపాడు : ఆందోళన చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - తణుకురూరల్

హమాలీ కార్మికుల పట్ల చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఎపి సీడ్స్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, టెండర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎపి సీడ్స్‌లో అక్రమ టెండర్ విధానం రద్దు చేయాలని, కార్మికులపై రాజకీయ కక్షలు ఆపాలని కోరుతూ నినదించారు. టిడిపి నేత గండి రామకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి పివి ప్రతాప్, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, పౌరహక్కుల సంఘం నాయకులు కౌరు వెంకటేశ్వరరావు, సిఐటియు జిల్లా నాయకులు పి.దక్షిణామూర్తి, అడ్డగర్ల అజయకుమారి, సీడ్స్ యూనియన్ కార్యదర్శి గాది త్రిమూర్తులు మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న కార్మికులను ఎందుకు తొలగిస్తున్నారని విమర్శించారు. సీడ్స్‌లో జరుగుతున్న అన్యాయాలను హమాలీలు ప్రశ్నిస్తూ అడ్డుతగులుతున్నారనే ఎక్కడా లేని టెండర్ విధానాన్ని తీసుకొచ్చారన్నారు. కార్మికులకు చట్టప్రకారం కనీసం నోటీసు కూడా ఇవ్వకపోవడం అధికారుల అవగాహనా లేమికి నిదర్శనమన్నారు. ధర్నా అనంతరం పైడిపర్రు ప్రాంతంలో కార్మికుల పట్ల అధికార వైసిపి, అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రచురించిన కరపత్రాలు ఇంటింటా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గార రంగారావు, శ్రీహరి, సాంబశివరావు, వరలక్ష్మీ, రూతమ్మ, రమణ, శ్రీదేవి పాల్గొన్నారు.

పెంటపాడు: కార్మికులకు నష్టదాయకమైన కొత్త టెండర్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడుతూ కొత్త టెండర్ విధానం వల్ల రైస్‌మిల్లుల్లో పనిచేసే కార్మికులు సివిల్ సప్లై గోడౌన్స్‌లో పనిచేసే కార్మికులు ఉపాధి కోల్పోతారన్నారు. ముఖ్యంగా రైతులు బాగా నష్టపోతారన్నారు. ఒకపక్క వ్యవసాయ రంగానికి గిట్టుబాటు ధర లేక పండించిన పంట అమ్ముకోలేక రైతులు చాలా ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో రైస్‌మిల్లుల్లో, సివిల్ సప్లై గోడౌన్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు అంతంతమాత్రంగా ఉన్న పనులను టెండర్ విధానం వల్ల మొత్తం పనులు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. ఈ టెండర్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతిని ధాన్యం సేకరణ మిల్లింగ్ తదితర పనులను ప్రభుత్వమే నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంకురు నాగేశ్వరరావు, పెనగంటి దుర్గ, కె.రమేష్, అల్లు రామకృష్ణ, అన్నవరం, వట్లూరు శ్రీను, రాము, జగన్నాథం, వెంకట్రాజు, చిన్న సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు మండలం ముద్దాపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నెం.1లో అంబేద్కర్ విగ్రహం ధ్వంసం ఘటనకు సంబంధించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. బుధవారం తణుకు రూరల్ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి యు.రవిప్రకాష్ వివరాలు వెల్లడించారు. ముద్దాయి గుమ్మిడి మోహన్, అతనికి సహకరించిన ఇద్దరు బాలురను కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. గతంలో కూడా విగ్రహం స్కూల్లో పెట్టినప్పుడు వీరు విబేధించినట్లు తెలిపారు. అంతేకాకుండా గత సంవత్సరం సెప్టెంబర్‌లో హీరో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ముద్దాపురం గ్రామ సెంటర్లో అంబేద్కర్, పవన్ కళ్యాణ్ ఫొటోలు కలిసి ఉన్న ఫ్లెక్సీలో అంబేద్కర్ బొమ్మను చింపివేసినట్లు తెలిపారు. దానిపై గ్రామ పెద్దలు వారిని మందలించి విషయాన్ని సర్దుబాటు చేశారన్నారు. అయినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పులేదని, మరలా అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి, తల బాగాన్ని వేరు చేసి పక్కనే ఉన్న చెరువులో పడవేశారన్నారు. ఘటన జరిగిన 24 గంటల్లోపు కారకులైన ముద్దాయిని, అతనికి సహకరించిన ఇద్దరు బాలురను అరెస్టు చేశామన్నారు. కేసు దర్యాప్తులో దర్యాప్తు అధికారి నరసాపురం డిఎస్‌పి కె.రవి మనోహరచారిని, తణుకు రూరల్ సిఐ సిహెచ్ ఆంజనేయులు, ఎస్ఐ జి.గుర్రయ్య, సిబ్బందిని జిల్లా ఎస్‌పి అభినందించారు.

పే స్కేల్ అమలు చేయకపోవడం దారుణం

బుద్ధుని విగ్రహం వద్ద కలెక్టరేట్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - భీమవరం

నాలుగేళ్లయినా పేస్కేల్స్ అమలు చేయకపోవడం దారుణమని కలెక్టరేట్ ఉద్యోగులు విమర్శించారు ఎపిజెఎసి అమరావతి పిలుపులో భాగంగా స్థానిక కలెక్టరేట్ ఉద్యోగులు చేపట్టిన నిరసన బుధవారం 21వ రోజు కూడా కొనసాగింది. దీనిలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఉద్యోగులు, సిబ్బంది గౌతమ బుద్ధుని విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ 11వ పిఆర్‌సి కమిషనర్ పెంచిన స్కేల్స్ ఆఫ్ గ్రేడ్ అమలు చేయకపోవడంతో జిల్లాలోని అన్ని డిపార్టుమెంట్లలో పని చేసే చాలామంది జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, తత్సమాన ఉద్యోగులందరికీ తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటానికి అంతా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షణాధికారులు ఎస్.సుబ్రహ్మణ్యం, సిహెచ్.రవికుమార్, నిజాముద్దీన్‌షా, సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, జి.కళ్యాణి, పి.గౌతమీ, పివి.సాంబశివరావు, కె.సురేష్, డిటి సూర్యనారాయణరాజు, జూనియర్ సహాయకులు దివ్య స్మైలీ, సాయి, జీవన్, సుభాష్, రమా, సిబ్బంది, బుజ్జియ్య, సూర్యాకాంతం, అనురాధ, మురళీ, సత్యనారాయణ, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్ కోరుతూ ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికుల సంఘం గౌరవాధ్యక్షులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానని వాగ్దానం చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని మరిచారని విమర్శించారు. తణుకు పట్టణంలో జనాభా పెరుగుతున్నారని, వార్డులు కూడా పెంచారని, అయితే కార్మికుల నియామకాలు మాత్రం జరగడం లేదని అన్నారు. దీనివల్ల కార్మికులపై పని భారం పెరుగుతుందన్నారు. సమాన పనికి సమాన వేతనం అని సుప్రీంకోర్టు చెప్పిన ప్రకారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ కార్డులు లేకపోవడం వల్ల అనారోగ్యానికి గురైె వైద్య సౌకర్యం పొందలేకపోతున్నారని, వారికి గుర్తింపు కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, కృష్ణబాబు, నీలాపు ఆదినారాయణ, కె.అరుణకుమారి, గట్టు కృష్ణ, పద్మ, యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న విట్టు కళాశాల అధ్యాపకులు

ప్రజాశక్తి - పాలకోడేరు

విద్యార్థులు ఒక లక్ష్యం నిర్దేశించుకుని భవిష్యత్తులో స్థిరపడే విధంగా చదువుకోవాలని, అప్పుడే జీవితంలో స్థిరపడతారని భీమవరం విష్ణు విట్ కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పెన్నాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో విష్ణు విట్ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా బుధవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, టెక్నాలజీ వినియోగంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విట్ కళాశాల అధ్యాపకులు, గ్రామ పంచాయతీ సర్పంచి అనూష, అధ్యాపకులు అమూల్య, శ్యామల, కృష్ణ మాధురి, నాగరాణి, సురేష్‌కుమార్ విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపల్ దసరా సూర్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ కె.శ్రీనివాస్, డీన్ నాగేంద్రకుమార్, హెచ్ఒడిలు శ్రీలక్ష్మి, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

అందుబాటులో అధిక దిగుబడినిచ్చే సాంకేతికత

ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డిఇ బి.విజయానందం

ప్రజాశక్తి - పెనుమంట్ర

అతి త్వరలోనే ఏరువాక కార్యక్రమం కింద కెవికెల ద్వారా రైతులకు అధిక దిగుబడినిచ్చే నూతన సాంకేతికతను అందుబాటులో ఉంచుతామని ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డిఇ బి.విజయానందం అన్నారు. బుధవారం స్థానిక మార్టేరు వ్యవసాయ పరిశోధనా సంస్థలో కిసాన్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో విజయానందం మాట్లాడుతూ ఆర్గానిక్ పద్ధతిలో రైతులు సాగు చేస్తే పెట్టుబడి భారం తగ్గుతుందన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కైకాగాల శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వర్ణకు ప్రత్యామ్నాయంగా ఎంటియు 1318 ద్వారా రైతు గిట్టుబాటు ధర పొందుతున్నారన్నారు. ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ 1920 నుండి నేటి వరకు 66 రకాలను రైతులకు అందించినట్లు తెలిపారు. అనంతరం దూరప్రాంతాల నుంచి వచ్చిన రైతులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. తెగుళ్ల నివారణపై రూపొందించిన బుక్‌లెట్, కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచులు మట్టా కుమారి, మామిడిశెట్టి ధనలక్ష్మి, శాస్త్రవేత్తలు, ఇతర జిల్లాల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

జీవిత బీమా సంస్థ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్ 30 శాతం పెంచాలని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆల్ ఇండియా పెన్షనర్ అసోసియేషన్ తలపెట్టిన ధర్నాకు మద్దతుగా తాడేపల్లిగూడెం ఎల్ఐసి కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు గారికిపాటి బాపయ్య శర్మ మాట్లాడుతూ మూడేళ్ల క్రితమే ఫ్యామిలీ పెన్షన్ 30 శాతం పెంచాలని సిఫార్సు చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమన్నారు. పెన్షనర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి యూనియన్ అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు, కార్యదర్శి సోలస సత్యనారాయణ, ఎస్. అశోక్ కుమార్,కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

ఆకివీడు నగర పంచాయతీ బడ్జెట్ రూ.10.80 కోట్లు

ఆకివీడు :నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం బుధవారం సాయంత్రం జరిగింది. ప్రారంభ నిల్వలతో సహా 10 కోట్ల 80 లక్షల 46 వేల 57 రూపాయల విలువైన బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇంతటి భారీ బడ్జెట్ఆకివీడు పట్టణానికి ఆమోదించడం చరిత్రలో తొలిసారి కావడం గమనార్హం. ఇందులో ప్రారంభ నిల్వ 89 లక్షల 75 వేల 173 రూపాయలు కాగా రూ.9,09,36,240లు 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను సవరించిన అంచనాలతో సహా బడ్జెట్ ఛైర్ పర్సన్ జామి హైమావతి ప్రవేశపెట్టారు. అయితే ప్రారంభ నిల్వ కలపడంతో మొత్తం ఈ సంవత్సరం రూ.12 లక్షల 61 వేల 240 మిగులు బడ్జెట్‌గా ఇది రూపొందింది. గత సంవత్సరంతో పోలిస్తే సుమారు పదిరెట్లు బడ్జెట్ అంచనాలు పెరిగాయి. అయితే ఈ దఫా వెచ్చింపులు కూడా పెరిగాయి. తాగునీటి సరఫరాకు 20.60 శాతం, మురుగునీటి పారుదలకు 14శాతం, రహదారుల అభివృద్ధికి 19.14 శాతం, వీధి దీపాల నిర్వహణకు 8.60, రిక్రియేషన్‌కు 11.20 శాతం, మార్కెట్లో కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి 20.45 శాతం కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఇంతటి భారీ బడ్జెట్ అమలు చేసేందుకు సరైన యంత్రాంగం గాని, సిబ్బంది గాని లేకపోవడం గమనార్హం.

కుళాయి బకాయిలు చెల్లించకుంటే చర్యలు

మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో మంచి నీటి కుళాయి పన్ను బకాయిలు వసూలు చేసేందుకు మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ బుధవారం చర్యలు చేపట్టారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి డి.సోమశేఖర్ యాదవ్, ఎసిపి పి.గౌరు, మున్సిపల్ ఆర్ఐ కృష్ణమోహన్, ఇంజినీరింగ్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బంది ఒక టీంగా ఏర్పడి పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఇందులో భాగంగా 21 అపార్ట్మెంట్లకు సంబంధించి నీటి పన్ను బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకున్నారు. పలు అపార్ట్‌మెంట్లకు కుళాయి కనెక్షన్లు తొలగించారు. దాదాపు 30 లక్షల రూపాయల వరకూ చెల్లించాల్సి ఉందని అధికారులు తెలిపారు. బకాయిలు వెంటనే చెల్లించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. కుళాయి పన్నులు చెల్లించని కుళాయి కనెక్షన్లు తొలగించేందుకు శుక్రవారం నుంచి ప్రత్యేక టీమ్‌లు యథావిధిగా పనిచేస్తాయని తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ర్యాలీ

ప్రజాశక్తి - పాలకోడేరు

ప్లాస్టిక్ వాడకం వల్ల కేన్సర్‌తో పాటు అనేక రోగాలకు గురవుతున్నామని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఎస్ఆర్‌కెఆర్ కళాశాల ప్రిన్సిపల్ జగపతిరాజు అన్నారు. మోగల్లులో ఎస్ఆర్‌కెఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలంటూ క్లాత్ కవర్లను వాడాలంటూ అవగాహన ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ఆర్.కృష్ణచైతన్య, ఎన్‌వి.సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధులకు నేత్ర పరీక్షలు

గణపవరం:పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వీరేశ్వరపురం గ్రామ సర్పంచి అడబాల రవిశంకర్ అన్నారు. బుధవారం గణపవరం పిహెచ్‌సి ఆధ్వర్యంలో స్థానికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారాలు లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం స్థానిక సచివాలయం వద్ద కంటి వెలుగులో భాగంగా 61 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. 61 మందికి కళ్లజోళ్లు పడతాయని డాక్టర్ ఐ.శ్రీనివాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఆరోగ్య కేంద్రం డాక్టర్లు పి.సంతోష్ నాయుడు, పి.కిరణ్మయి, సిహెచ్‌ఓ జాలాది విల్సన్‌బాబు పాల్గొన్నారు.

దాట్ల శ్రీదేవి ట్రస్టు ద్వారా విశేష సేవలు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ పేదలకు విశేష సేవలందిస్తోందని ట్రస్ట్ అధినేత దాట్ల వెంకట రామరాజు అన్నారు. బుధవారం కాళ్లకూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్రస్ట్ ద్వారా మోక్షధామం అభివృద్ధి పనులు, క్రిష్టియన్ పేటలో వంతెన నిర్మాణ పనులు, పేద ప్రజలకు ఆర్థిక సాయం అందించామన్నారు. ఈ నెల 30న శ్రీరామనవమి సందర్భంగా పానకం, ప్రసాద వితరణ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అన్నాక్యాంటీన్ వద్ద అన్నదానం

తణుకు:మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో తణుకు పట్టణంలో నిర్వహిస్తున్న అన్నా క్యాంటీన్ బుధవారానికి 167వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దాతలు రాధాకృష్ణ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 150 మందికి పైగా అన్నదానం చేసినట్లు తెలిపారు. టిడిపి ప్రజల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. అనంతరం దాతలను, టిడిపి నేతలను అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని శశి ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ తెలిపారు. శశి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం వార్షిక క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ క్రీడలకు కొంత సమయం కేటాయించాలని, తద్వారా మానసిక ఒత్తిడిని అధిగమించొచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ తమ కళాశాల నుండి జాతీయ, రాష్ట్ర యూనివర్సిటీ స్థాయి క్రీడల్లో రాణించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు వివిధ విభాగాలలో క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ అఫైర్స్ టి.సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ శేఖర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

భీమవరం రూరల్ :రాష్ట్ర ప్రయివేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోషియేషన్ అపుస్మా వారు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన టాలెంట్ టెస్టులో తమ విద్యార్థులు కె.జయసాయిశ్రీ, ఆర్.భరద్వాజ్ (6వతరగతి), పి.సుహానాస్టెల్లా (7వతరగతి), ఎల్ఎస్.నందిని (7వ తరగతి) రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించారని స్కూల్ డైరెక్టర్, లయన్ కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్లో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు. వారికి తర్ఫీదు ఇస్తున్న ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, బి.యుగసుధ, కె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

బొండాడలో కళాకారులకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

మల్లికార్జునరావు కళల పట్ల ఆసక్తితో నాటకరంగ కళాకారులతో బొండాడ గ్రామంలో ఏటా పలు నాటకాలు నిర్వహించేలా కృషి చేయడం అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. బొండాడలో కందుల లక్ష్మణ స్వామి, లక్ష్మీ తులసమ్మ దంపతులచే ప్రతిష్టించిన భద్రాద్రి సీతారామచంద్ర స్వామి 30వ వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా నాటకరంగ కళాకారులను బుధవారం సత్కరించారు. ఉభయ రాష్ట్రాల్లో నాటక రంగంలో విశిష్ట ప్రతిభ కనబర్చిన జి.రత్నశ్రీ, సత్తిబాబు దంపతులకు సువర్ణ హస్త కంకణంతో మాజీ ఎంపిపి కందుల వెంకట మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సత్కరించారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు, టిటిడి మాజీ గోకరాజు రామరాజు, అల్లూరి సీతారామరాజు సేవా సమితి అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు చేతులమీదుగా జి.రత్న శ్రీ, సత్తిబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ జిల్లా అధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, వైసిపి నాయకులు పాతపాటి శ్రీనివాసరాజు, జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, డొక్కు సోమేశ్వరరావు, మాలవానితిప్ప సర్పంచి సాగిరాజు సుబ్బరాజు,జక్కరం ఉపసర్పంచ్ కూచంపూడి లక్ష్మీపతి రాజు, మన్నే నాగరాజు, వెంకన్న, అర్చకులు పాల్గొన్నారు.


నాటక రంగ కళాకారులకు సువర్ణ హస్త కంకణంతో సత్కరిస్తున్న నేతలు

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పెనుమంట్ర

టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని మార్టేరు, వెలగలేరు, పొలమూరు, మాముడూరు, సోమరాజు ఇల్లింద్రపర్రు, గరువుతో పాటు పలు గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి (బుల్లాలు), నియోజకవర్గ రైతు సంఘం నాయకులు వెలగల బుల్లి రామిరెడ్డి, చింతపల్లి రామకృష్ణ, కర్రి అచ్యుత రామారెడ్డి పాల్గొన్నారు.


మొగల్తూరులో టిడిపి జెండాను ఎగురవేస్తున్న నేతలు

గణపవరం : టిడిపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు ఇందుకూరి రామకృష్ణంరాజు మాట్లాడారు. ముందుగా కుమారి థియేటర్ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు సురేంద్ర కుమార్‌రాజు, నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు : పట్టణంలోని గాంధీ బొమ్మల సెంటర్లో టిడిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నేన గౌరునాయుడు, పెచ్చెట్టి బాబు, కోడి విజయ భాస్కర్ జీవి పాల్గొన్నారు.

ఆచంట : మండలంలోని ఆచంట, కొడమంచిలి పెదమల్లం, కోడేరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, భీమలాపురం, వల్లూరు, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు గ్రామాల్లో టిడిపి ఆవిర్భావం సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు, కేతా మీరయ్య కేతా మురళీ, వెంకటరమణ, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి పాల్గొన్నారు.

ఉండి : రాష్ట్రంలో దుష్టపాలనకు చరమగీతం పాడాలని టిడిపి నేతలు పిలుపునిచ్చారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉండి మెయిన్ సెంటర్లో మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు కాగిత మహంకాళి, మంతెన సూర్యనారాయణ రాజు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : కృష్ణబలిజ సాధికార కమిటీ రాష్ట్ర సభ్యుడు గంటా త్రిమూర్తుల ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల అధ్యక్షులు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, రేవు వెంకన్న ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్‌కట్ చేశారు. వీరమ్మచెరువు బివి.రాజు పార్క్ సెంటర్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించి, సీనియర్ నాయకులు మద్దుల రాము ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమలలో నేతలు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, గుడూరి సుబ్బారావు, రేవు వెంకన్న పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : పూలపల్లిలో టిడిపి ఆవిర్భావ వేడుకలు మండల అధ్యక్షులు కోడి విజయ భాస్కరరావు నిర్వహించారు. పూలపల్లి సెంటర్లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పాముల రజనీకుమార్, యూనిట్ ఇన్‌ఛార్జి అందే కోటి వీరభద్రం, అంగర వీరభద్రకుమార్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని గాంధీ బొమ్మ సెంటర్లో పార్టీ గ్రామ అధ్యక్షుడు బస్వాని ఏడుకొండల ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, కలిదిండి కుమార్‌బాబు, బళ్ల శ్రీను పాల్గొన్నారు.

వీరవాసరం :టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నేతలు బుధవారం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని మాట్లాడారు. కార్యక్రమంలో వీరవల్లి చంద్రశేఖర్, రాయపల్లి వెంకట్, మల్ల శ్రీరామచంద్రమూర్తి, అంగర కుటుంబరావు పాల్గొన్నారు.

కాళ్ల : మండలంలోని కలవపూడి, కాళ్ల, కాళ్లకూరు, ఏలూరుపాడు, పెదఅమిరం గ్రామాల్లో టిడిపి ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలవపూడి, పెదఅమిరం గ్రామాల్లో ఉండి మాజీ ఎంఎల్ఎ శివరామరాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉండి డిసి మాజీ ఛైర్మన్ తోట ఫణిబాబు పాల్గొన్నారు.

తణుకు : టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్, వీరనారాయణ థియేటర్ సెంటర్లోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు టిడిపి నాయకులు నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డి. వెంకట సుధాకర్, పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పోడూరు : టిడిపి మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో కొమ్ముచిక్కాలలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు సీతారామరాజు, దొంగ సూర్యప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి) ఆధ్వర్యంలో పట్టణాధ్యక్షులు పట్నాల రాంపండు అధ్యక్షతన కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం శేషామహల్ రోడ్డులోని ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ నాయకులు మాదాసు సత్యనారాయణ, నెక్కలపూడి అమ్మిరాజును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, పెంటపాడు రూరల్ మండలం నాయకులు పాల్గొన్నారు. చినతాడేపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పుల్లయ్యగూడెంలో టిడిపి గ్రామ అధ్యక్షులు మైలవరపు సుబ్బారాయుడు సమక్షంలో పార్టీ జెండాను ఎగరవేశారు.

పెనుగొండ : టిడిపి కార్యాలయం వద్ద నేతలు ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి నక్కా శ్యామలాసోని, నక్కా వేద వ్యాసశాస్త్రి మాట్లాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కటికిరెడ్డి నానాజీ, వేంద్ర రాము, ఎం.వెంకటేష్, మండా ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకోడేరు : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఎన్‌టిఆర్ అని టిడిపి మండల అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు తెలిపారు. మండలంలోని పాలకోడేరు, గొల్లలకోడేరు, పెన్నాడ, గొరగనమూడి, విస్సాకోడేరు, మోగల్లు, కోరుకొల్లు, వేంద్ర తదితర గ్రామాల్లో టిడిపి నాయకుల ఆధ్వర్యంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోటేశ్వరరాజు, రాంబాబు, జి.సూర్యనారాయణ రాజు, టిడిపి సీనియర్ నాయకుడు చేబోలు రామకృష్ణ, గాదిరాజు శ్రీనివాసరాజు, ఖాజా వీరస్వామి శంకరుడు తదితరులు పాల్గొని ఆయా గ్రామాల్లో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిచారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

పాలకోడేరు:విద్య ద్వారానే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గొరగనమూడి సర్పంచి గొట్టుముక్కల వెంకట శివరామరాజు (శివాజీ రాజు), పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ పొన్నమండ బాలకృష్ణ అన్నారు. గొరగనమూడి స్వామి జ్ఞానానంద జిల్లా పరిషత్ హైస్కూల్లో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం హెచ్‌ఎం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన శివాజీ రాజు, బాలకృష్ణ మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం అన్ని వసతులూ కల్పిస్తోందన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు గొరగనమూడి గ్రామ ఆశా వర్కర్ మన్నే అనంత సూర్యకుమారి, మహంకాళి వరప్రసాద్ దంపతులు విద్యా సామగ్రిని అందజేశారు. సామగ్రిని సర్పంచి శివాజీ రాజు, పొన్నమండ బాలకృష్ణ, జానకిరామరాజు, పరమేశ్వరరావు, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, కార్యదర్శి పోలయ్య, ఉపాధ్యాయుల చేతుల మీదుగా అందజేశారు.

ఆచంట: విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సంపాదించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వైసిపి నాయకులు అరిగెల సురేష్ బాబు అన్నారు. పెనుమంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం ఆయన అట్టలు, పెన్నులు, స్కేలు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

పశువులకు టీకాలు

పోడూరు:కొమ్ముచిక్కాల గ్రామంలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం జెడ్‌పిటిసి గుంటూరి పెద్దిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పశువులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఏప్రిల్ 24వ తేదీ వరకూ మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తామని మండల పశువైద్య అధికారి డాక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రలు ఆర్.మూర్తి, రామస్వామి, సుబ్బారావు పాల్గొన్నారు.

సంక్షేమం అభివృద్ధి కాదా : ఎంఎల్ఎ గ్రంధి

ప్రజాశక్తి - వీరవాసరం

అభివృద్ధి లేదంటూ విమర్శలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలు గతంలో ఎన్నడూ లేని విధంగా వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కాదా అంటూ భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ టిడిపి, జనసేనను ఉద్దేశించి ప్రశ్నించారు. వైఎస్ఆర్ ఆసరా ద్వారా డ్వాక్రా మహిళలకు చెక్కుల అందించే కార్యక్రమం బుధవారం వీరవాసరం తులసీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హామీలు అమలు చేయని టిడిపికి, ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి ఉన్న తేడాను ప్రజలు గమనించాలన్నారు. మహిళా సాధకారితే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఒక కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతున్న ఆలోచనతో సిఎం జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వారు చేస్తే ఒప్పు మేము చేస్తే తప్పు అన్న విధంగా ప్రతిపక్షాల ధోరణి ఉందన్నారు. అనంతరం మండలంలో మొత్తం 1262 స్వయం సహాయక సంఘాలకు రూ.11.8 కోట్ల నమూనా చెక్కును ఎంఎల్ఎ చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చికిలే మంగతాయారు, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, వేంద్ర వెంకటస్వామి, ఎపిఎం ఎస్ఎస్. అమీరున్నిసా, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

నరసాపురం:కుల, మత, పార్టీలు,వర్గాలు అనే భేదాలు లేకుండా అర్హతనే కొలమానంగా తీసుకుని ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి జమ చేస్తున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. బుధవారం మూడో విడత వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానిక ప్రసాద రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని 634 సహాయక సంఘాల సభ్యులకు సుమారు రూ.5.62 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఒక్క నరసాపురం నియోజకవర్గానికి రూ.160 కోట్లు అందించారని తెలిపారు. విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. అనంతరం మహిళలు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, రాష్ట్ర కనీస వేతనాలు ఛైర్మన్ బర్రి లీలా శంకర్, పట్టణ అధ్యక్షులు జయప్రకాష్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : పాలకొల్లు మండల పరిషత్ ఆవరణలో అంబేద్కర్ భవనం వద్ద వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ మండలానికి సంబంధించి 1535 గ్రూపులకు 1367 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి వంకా రవీంద్ర, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, జెడ్‌పిటిసి నడపల గోవిందరాజుల నాయుడు పాల్గొన్నారు.

పెంటపాడు : మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు పెంటపాడులో ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. సుమారు 3490 మందికి 12 కోట్ల 95 లక్షల 75 వేల రూపాయలు చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. సభకు ఎంపిపి దాసరి హైమావతి అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాపులు తిట్టడానికి దత్తపుత్రుడు 100 కోట్లు తీసుకుని రాజకీయం చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తాడేపల్లి సూర్యకళ, ఎంపిటిసి సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - పాలకోడేరు

మానసికంగా ఇబ్బంది పడుతున్న తన పెద్ద కుమారుడు కొప్పాడి కాసుబాబు ఈనెల 18వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి కొప్పాడి ధర్మారావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు నమోదు చేశామని పాలకోడేరు పోలీసులు బుధవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా పల్లం గ్రామానికి చెందిన కొప్పడి ధర్మారావు బతుకుతెరువు కోసం భార్యాబిడ్డలతో నాలుగు సంవత్సరాల క్రితం గొరగనమూడి గ్రామానికి వచ్చారు. అప్పటినుంచి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు కాసుబాబుకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వైజాగ్ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈనెల 18న ధర్మారావు మోటార్ సైకిల్ బాగు చేయించేందుకు భీమవరం వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి కాసుబాబు లేకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. దొరక్కపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై హెడ్ కానిస్టేబుల్ వెంకటేశం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు మండలం ముద్దాపురం గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహోన్నత వ్యక్తి పట్ల ఇటువంటి చర్యలు బాధాకరమని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించి, ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో కుల మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని కొన్ని దుష్టశక్తులకు తగిన బుద్ధి చెప్పాలని తెలిపారు.

విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అవసరం : ఎస్ఐ

పాలకోడేరు:విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ అవసరమని ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు అన్నారు. విస్సాకోడేరు సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో బుధవారం ఎస్ఐ విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అమ్మాయిలు అపరిచిత వ్యక్తుల పట్ల ఎలా జాగ్రత్తగా ఉండాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో ముఖ్యమన్నారు. క్రమశిక్షణతో మెలగడం వల్ల భవిష్యత్తులో అనేక ఉపయోగాలుంటాయన్నారు. స్కూల్ ప్రధానోపాధ్యాయిని డిఆర్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రతి విషయంపైనా అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం ఎస్ఐను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ శంకర్, విస్సాకోడేరు మహిళా పోలీస్ శ్రీదేవి పాల్గొన్నారు.

భీమవరం నుంచి కాశీకి ప్రత్యేక రైలు నడపాలి

భీమవరం రూరల్:భీమవరం నుంచి బెంగుళూరు, భీమవరం నుంచి కాశీ, విశాఖపట్నానికి ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలు నడపాలని శ్రీవిజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఒక ప్రకటన ద్వారా రైల్వే అధికారులను కోరారు. పుణ్య క్షేత్రాలకు వెళ్లే వారి కోసం ప్రతిరోజూ వెళ్లే విధంగా రైళ్లు వేయాలని పేర్కొన్నారు. డబ్లింగ్ లైన్లు, రైల్వే స్టేషన్ల సుందరీకరణ పనులు బాగా జరిగాయని తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మొగల్తూరు:నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకునేలా చైతన్య పర్చాలని ఎంపిడిఒ ఆర్‌సి ఆనంద్‌కుమార్ సూచించారు. బుధవారం మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో వెల్ఫేర్ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. యాప్ ద్వారా లబ్ధిదారుల వివరాలు నమోదు డిజిటల్ కేంద్రంలో అందిస్తున్న శిక్షణ సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ కాలేజీ ఇన్‌ఛార్జి టి.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

ఆచంట :అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ముఖ్యమంత్రి అందిస్తున్న పోషకాహారాన్ని అంగన్‌వాడీ చిన్నారులు, కిశోర బాలికలు, బాలింతలు విధిగా తీసుకొని రక్తహీనతకు గురి కాకుండా ఉండాలని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారాం అన్నారు. కొడమంచిలి సచివాలయ కార్యాలయం వద్ద బుధవారం పోషణ్ పక్వాడ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వపరంగా మహిళలకు అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పోలిశెట్టి దుర్గాభవాని, గున్నాబత్తుల కామేశ్వరి, సల్లపూడి సుజాత పాల్గొన్నారు.

పెనుగొండ : పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని ఐసిడిఎస్ అధికారి ఎం.విజయకుమారి అన్నారు. బుధవారం సిహెచ్‌సిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సర్పంచి శ్యామలా సోనీ మాట్లాడుతూ చిన్నతనం నుంచి పిల్లలకు పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

పెనుమంట్ర:ప్రతి విద్యార్థీ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి) అన్నారు. బుధవారం ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆశీస్సులతో మార్టేరు గ్రామ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పంచగ్రామం రెడ్డి సేవా సంఘం మార్టేరు రెడ్డి కళ్యాణ మండపంలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో మార్టేరు పంచ గ్రామాల నుండి 10వ తరగతి చదువుతున్న వివిధ పాఠశాలల విద్యార్థులు సుమారు 165 మందికి బహుమతులు అందించారు.